క్లుప్తంగా

హర్షం

గుమ్మలక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్టీ) కమిషన్ చైర్మన్‌గా డీవీజీ శంకర రావు నియామకం పట్ల పార్వతీపురం మన్యం జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు అడ్డాకుల చిన్నారావు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకర్లతో మాట్లాడారు. విద్యాధికుడిగా, మాజీ పార్లమెంట్ సభ్యుడిగా, గిరిజన ప్రాంతాల్లో సమస్యలపై పూర్తి అవగాహన గల ప్రొఫెసర్ శంకరరావును సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా నియమించడం ద్వారా మరోమారు గిరిజనుల పట్ల తన కున్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నారన్నారు. సామాజిక న్యాయం కల్పించడంలో సీఎం జగన్ తనకు తానే సాటి అని పై నియామకాన్ని బట్టి రుజువైందని చిన్నారావు పేర్కొన్నారు.

చివర్లు తీసి నాట్లు వేయాలి

• ఏవో తిరుపతిరావు



వరి నాట్లు వేయిస్తున్న ఏవో తిరుపతిరావు

పాచిపెంట: వరి నారు చివర్లు తుంచి నాట్లు వేసుకోవడం వల్ల కాండం తొలుచు పురుగును గుడ్ల దశలోనే నివారించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి కె. తిరుపతిరావు అన్నారు. మండలంలోని పాంచాలి గ్రామంలో రైతు కర్రి సత్యం పొలంలో చివర్లు తుంచి నాట్లు వేసే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. చివర్లు తుంచడం వల్ల పైరుకు గాలి ధారాళంగా తగలడం వల్ల చీడపీడల ఉధృతి తగ్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏలు మోహనకృష్ణ, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

నాట్లు వేసే వేళ మెలకువలు పాటించాలి



విత్తనోత్పత్తి పొలంలో పొలంబడి నిర్వహిస్తున్న డీఆర్సీ ఏడీఏ శారద

సీతానగరం: ఖరీఫ్ సీజన్‌లో వరి నాట్లు వేసినప్పటి నుంచి రైతులు మెలకువలు పాటించాలని డీఆర్సీ ఏడీఏ శారద సూచించారు. మండలంలోని ఏగోటివలస గ్రామంలో ఏఓ ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో భాగంగా రైతు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలు కట్టే పొలంలో సరైన విత్తన యాజమాన్య పద్ధతులు పాటించాలని చెప్పారు. విత్తనాలు విత్తే సమయంలో విత్తన శుద్ధి సుడోమోనాస్ 10గ్రాములు ఒక కేజీ విత్తనానికి కలిపి వేయడం వల్ల తొలిదశలో ఆశించే తెగులు, పురుగుల బారిన పడకుండా ఉంటుందన్నారు. పంటదమ్ము చేసిన మడులలో వరినాట్లు వేసే సమ యంలో 2-3 మొనలు ఒక కుదురు చొప్పున చ.మీకి 33 కుదుళ్లు వచ్చే విధంగా నాటుకోవడం వల్ల మొక్కలకు గాలి,వెలుతురు బాగా తగిలి అధిక దిగుబడికి దోహద పడుతుందన్నారు. ఎరువుల యాజమాన్యంలో భాగంగా మొదటి విడతలో యూరియా, డీఏపీ, పొటాష్ రెండో విడతలో యూరియా మూడవ విడతలో పొటాష్, యూరియా వేసుకోవాలని సూచించారు. ఏఓ ఎస్ అవినాష్ మాట్లాడుతూ గ్రామీణ విత్తనోత్పత్తి పథకం(ఎస్‌వీపీ) పథకం కింద ఫౌండేషన్ విత్తనం పంపిణీ చేశామని వాటిని 3 కాలాల వరకు విత్తనం కోసం ఉపయోగించుకోవచ్చునని వివరించారు. అదే విధంగా నాట్లు వేసే సమయంలో ప్రతి 2 మీటర్లకు 20 సెం.మీ చొప్పున కాలిబాటలు తీసుకోవాలని తెలియచేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఏగోటివలస సర్పంచ్ యు.రాధాకృష్ణ ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు రైతులకు కందివిత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

నెలలో రెండుసార్లు వైద్య శిబిరాలు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథ రావు

పార్వతీపురంటౌన్: ప్రతి గ్రామంలో నెలలో రెండుసార్లు ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని వెంకంపేట గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ప్రతి నెలా రెండుసార్లు నిర్వహించే వైద్యశిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నిర్వహించే ఈ వైద్యశిబిరంలో వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నామని, పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు మందులను అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచిస్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

జగనన్నతోనే అవినీతి రహిత పాలన

• ఎమ్మెల్యే కళావతి
• కీసరజోడు సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమ పథకాలపై వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: గత ప్రభుత్వాలకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అవినీతి రహిత సంక్షేమ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. కీసరజోడు పంచాయతీలో కీసరజోడు, దిబ్బగూడ, కొంజరుగూడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గిరిజనులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ఎమ్మెల్యే అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బందితో వెళ్లి అడిగి తెలుసుకున్నారు. నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే సంక్షేమ పథకాల నగదు బదిలీ చేయడంతో ప్రజలందరు సంతోషిస్తున్నారన్నారు. నవరత్నాలు ప్రతీ గడపలోనూ వెలుగులు నింపడంతో జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. ప్రతీ ఇంటికి అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ పంటల బీమా, జగనన్న చేదోడు, వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ రుణాలు తదితర సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. గ్రామ వలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా జగనన్న నిలిచారన్నారు. గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజల వద్దకు పాలన అందిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీనే అధికారంలోకి తీసుకురావాలన్నారు. నాడు – నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఏవైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. సీసీ రహదారులు నిర్మించాలని, హౌసింగ్ బిల్లులు ఇప్పించాలని గ్రామస్తులు కోరారు. వీటిపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సత్యం, ఎంపీపీ బి.ఆదినారాయణ, పార్టీ కన్వీనర్ జి.సుమిత్రరావు, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, సర్పంచ్ ఎస్.రవి, ఎంపీటీసీలు మంగయ్య, హరిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు సాయికిరణ్, చలపతి, ఎర్రయ్య, ఎస్.వెంకటేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత భవనాలను పూర్తి చేయాలి : పీవో



కళ్లికోటలో విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న పీవో విష్ణుచరణ్

కొమరాడ: గ్రామాల్లో నిర్మాణాల్లో ఉన్న ప్రాధాన్యత భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలని పార్వతీపురం ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్ ఆదేశించారు. మండలంలోని దుగ్గి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కూడా తనిఖీలు నిర్వహించామన్నారు. జీవీకే కిట్లు, నాడు – నేడు పనులు పరిశీలించారు. నాణ్యతలో ఎటువంటి లోపాలు ఉండకూడదన్నారు. మధ్యాహ్న భోజనం పథకంలో మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. కళ్లికోట గ్రామంలో వెల్‌నెస్, రైతు భరోసా కేంద్రాలను త్వరితగతిన నిర్మాణం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పలువురు అధికారులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో సమస్యల పరిష్కారం



ధ్రువపత్రాలను అందజేస్తున్న జిల్లా గ్రామ పంచాయతీ అధికారి సత్యనారాయణ

కురుపాం: జగనన్న సురక్ష కార్యక్రమంతో సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఊసకొండ పంచాయతీ పొడ్డిశ సచివాలయం ఆవరణలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి ఇంకా మిగిలి ఉన్నటువంటి వారు జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సురక్ష కార్యక్రమంలో మంజూరైన ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సులోచన, ఎంపీడీవో వి.శివరామప్ప, ఉప తహసీల్దార్ నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు అందిస్తాం..: ఈఈ



సీతారాంపురంలో జల్ జీవన్ మిషన్ పథకాన్ని పరిశీలిస్తున్న ఈఈ ప్రభాకరావు

గరుగుబిల్లి: జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటిని అందించడమే గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఒ.ప్రభాకరరావు అన్నారు. మండలంలోని కొంకడివరం పంచాయతీ సీతారాంపురం గ్రామంలో జల్ జీవన్ మిషన్‌పై ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటిని అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా తాగునీటి పథకాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈఈ కె.నాగేశ్వరరావు, జేఈ గౌరీశంకరరావు, ఎంపీడీవో జి.పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న ఎస్‌ఐ శివప్రసాద్

పాలకొండ రూరల్: మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు సంభవించడంతో పాటు ప్రాణాపాయం ఉందని ఎస్‌ఐ బి.శివప్రసాద్ అన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాలకొండ – సీతంపేట, వీరఘట్టం, విశాఖపట్నం మార్గాలలో వాహన తనిఖీలతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. అనుమానమున్న వాహనదారులను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు చేశారు. నిర్ధారణ అయిన వారిపై కేసులు నమోదు చేశారు. వాహన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని వారికి అపరాధ రుసుం విధించారు.

యువతకు వాలీబాల్ కిట్ల అందజేత



వాలీబాల్ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: మండలంలోని కొంజరుగూడ గిరిజన యువతకు వాలీబాల్ కిట్లను పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో వాలీబాల్ ఆడుతూ ఆరోగ్యకరంగా ఉండాలన్నారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అలాగే వివిధ ప్రాంతాల్లో జరిగే పోటీలకు కూడా హాజరై విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మిషన్ ఇంద్రధనుష్ సర్వే వేగవంతం



ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న డీఐవో జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: మిషన్ ఇంద్ర ధనుష్ సర్వే వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐవో) డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు కోరారు. ఈ మేరకు ఆయన పట్టణంలోని 19 వ వార్డులో వైద్యసిబ్బంది నిర్వహించిన ఇంటింటి సర్వేను బుధవారం పర్యవేక్షించారు. ఈ సర్వేలో ఐదు సంవత్సరాలలోపు పిల్లలు, గర్భిణులకు సకాలంలో అన్ని టీకాలు వేశారా? ఎవరైనా డ్రాపౌట్స్, లెఫ్ట్‌ఔట్స్ ఉన్నారా గుర్తించాలని, సచివాలయాల వారీగా వారి పరిధిలో ఉన్న మొత్తం ఇళ్లను సర్వే చేసి త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతిరోజూ ఎన్ని ఇళ్లను సర్వే చేశారు, టీకా వేయని వారిని ఎవరినైనా గుర్తించారా తదితర నివేదికలను ప్రతిరోజూ జిల్లా కార్యాలయానికి ఆన్‌లైన్‌లో పంపాలని, వాటికి సంబంధించి మైక్రో ఏక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. టీకా కార్యక్రమం మరింత సమగ్రంగా నిర్వహించి తట్టు, రుబెల్లా వ్యాధులను పూర్తి స్థాయిలో నిర్మూలించడం ఈ మిషన్ ఇంద్రధనుష్ ముఖ్య ఉద్దేశమని అన్నారు. అదేవిధంగా 18,19 వార్డులకు చెందిన అంగన్వాడీ కేంద్రంలో వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని డీఐవో జగన్‌మోహన్‌రావు పరిశీలించారు. టీకా కార్డులు, రికార్డులు పరిశీలించారు. అక్కడ పిల్లల తల్లులతో మాట్లాడి ఆరోగ్య పరిశీలన చేసి, తగు జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ జయగౌడ్, ఏఎన్‌ఎం ఉమా మహేశ్వరి, అంగన్వాడీ సిబ్బంది జ్యోతి, కుమారి, ఆశ కార్యకర్త తదితరులున్నారు.

గిరిజన యువకుడిపై దాడి శోచనీయం

సీతంపేట: ఒంగోలులో మోత నవీన్ అనే గిరిజన యువకుడిపై దాడి ఘటన సిగ్గుచేటని, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు జె.శ్రీరాములు, సాయి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తొమ్మిది మంది దుండగులు గిరిజన యువకుడిపై మూత్రం పోసి దాడి చేయడం సభ్యసమాజం తలదించుకునేలా ఉందని పేర్కొన్నారు. దీన్ని తమ సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన



ప్రకృతి వ్యవసాయ పంటలు పరిశీలించిన రీజనల్ అధికారి కె.ప్రకాశ్

పార్వతీపురంటౌన్: మండలంలోని ఎమ్మార్‌నగరం, బాలగుడబ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చేపట్టిన నవధాన్యాల సాగును ప్రకృతి వ్యవసాయ శాఖ రీజనల్ అధికారి కె.ప్రకాశ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించిన రైతులకు ఎస్2ఐఎస్ కిట్లు తయారు చేసి సకాలంలో అందజేయాలని, ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా రైతుభరోసా కేంద్రం ద్వారా ప్రకృతి వ్యవసాయ విస్తరణ జరగాలని అభిప్రాయ పడ్డారు. ప్రతి వీఓకు ఒక ఎన్పీఎం (ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రం) షాపు ఉండాలని, కషాయాలు, ద్రావణాలు రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ మంతిని మానస, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

గ్రామకంఠాలపై శాశ్వత హక్కు

రేగిడి: గ్రామాల్లోని గ్రామకంఠం స్థలాలకు సంబంధించి, శాశ్వత హక్కు కల్పిస్తూ ప్రాపర్టీ కార్డులు ఇవ్వడం జరుగుతుందని తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి తెలిపారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ప్రతీ గ్రామంలో సర్వే సిబ్బంది రెవెన్యూ రికార్డుల ప్రకారం స్థలాలు గుర్తించి, ఆ స్థలాలకు సంబంధించిన యజమానులకు భూ హక్కు పత్రాలు అందించడం జరుగుతోందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.గోవిందరావు, ఎంపీటీసీ పి.అప్పలనాయుడు, సర్వే డీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

10 మద్యంసీసాల స్వాధీనం

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురంలో అక్రమంగా తరలిస్తున్న 10 మద్యంసీసాలను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి, ఖండ్యాం గ్రామానికి చెందిన గుటివాడ సత్యంను అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ బుడుమూరు లోకేశ్వరరావు తెలిపారు.

మొక్కలు నాటడానికి అదును



మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ భాను

సీతానగరం: ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో మొక్కలు నాటడానికి వాతావరణం అనుకూలించడంతో ఉపాధిహామీ పథకం ద్వారా మొక్కలు నాటడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఏపీఓ భాను, జేఈ కృష్ణ సూచించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం అధికార సిబ్బందితో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రభుత్వ చెరువు గట్లపైన, సాగునీటి కాలువ గట్లపైన, పాఠశాల ప్రాంగణాల్లో ప్రజలకు నీడనిచ్చే మొక్కలు నాటడానికి సిద్ధం చేయాలని సూచించారు. సన్నకారు రైతులకు సంబంధించిన భూములలో ఫలసాయాన్నిచ్చే మొక్కలు నాటాలని చెప్పారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన (పోడు) భూముల్లో ఆదాయ వనరులు కలిగిన ఫలజాతి మొక్కలు రైతులు వేయాలని సూచించారు. క్షేత్ర సహాయకులు లబ్ధిదారులను ఎంపిక చేసిన వెంటనే వారికి అనుకూలంగా ఉన్న మొక్కలు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

• పార్వతీపురం ఐటీడీఏ డీడీ శ్రీనివాసరావు



సంక్షేమాధికారులకు సూచనలిస్తున్న ఐటీడీఏ డీడీ శ్రీనివాసరావు

గుమ్మలక్ష్మీపురం:

గిరిజన సంక్షేమ బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పార్వతీపురం ఐటీడీఏ డీడీ కె.శ్రీనివాసరావు అన్నారు. గుమ్మలక్ష్మీపురం ఏటీడబ్ల్యూవో కార్యాలయం వద్ద ఆశ్రమ పాఠశాలల సంక్షేమాధికారులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, విద్యార్థులకు ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా తక్షణమే స్పందించి సరైన వైద్య సేవలు అందివ్వాలన్నారు. మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని, ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించి, విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలంటూ సూచించారు. సమావేశంలో ఏటీడబ్ల్యూవో సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

కురుపాం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో కొత్త మెనూ సక్రమంగా అమలు చేయాల్సిందేనని పార్వతీపురం ఐటీడీఏ డీడీ కె.శ్రీనివాసరావు సూచించారు. కురుపాం ఏటీడబ్ల్యూవో కార్యాలయంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సంక్షేమాధికారులతో బుధవారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని, గిరిజన విద్యార్థుల ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీజనల్ వ్యాధుల బారిన పడితే వెంటనే సమీపంలో ఉన్న పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు తీసుకువెళ్లి ఆరోగ్య తనిఖీలు చేయించాలన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు చేపట్టి ఇప్పటికే నియామకాలు చేపట్టామని ఎక్కడైనా సబ్జెక్టు ఉపాధ్యాయులు కొరత ఉంటే వెంటనే నివేదికలు తయారు చేసి అందించాలని సూచించారు. సమావేశంలో కురుపాం ఏటీడబ్ల్యూవో చంద్రబాబు, ఏఎంఓ బి.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు, సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుడికి సన్మానం



సూర్యనారాయణ మాస్టారును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

వీరఘట్టం: మండలంలోని సంత నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఇటీవల బదిలీ అయిన ఆర్.సూర్యనారాయణను పాఠశాల హెచ్.ఎం ఎం.ఈశ్వరరావుతో పాటు ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సత్కరించారు. విద్యార్థులు గణితంలో పట్టు సాధించేలా సూర్యనారాయణ మాస్టారు చేసిన కృషిని హెచ్‌ఎం కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీబీ షాలిని, కేపీ నాయుడు, వి.శ్రీధర్, కె.అశోక్, సాల్మన్‌రాజ్, బీవీఏ నాయుడు, సాధు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో మంచి దిగుబడులు



పొలంబడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రత్నకుమారి

వీరఘట్టం: పంటల యాజమాన్య పద్ధతులు పాటించడంతో పాటు సస్యరక్షణ చర్యలు చేపడితే పంటల దిగుబడి బాగుంటుందని వ్యవసాయ శాఖ ఏడీఈ రత్నకుమారి రైతులకు సూచించారు. తెట్టంగిలో బుధవారం నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. నారుమడులు సిద్ధం చేయడం, ఉబాలు వేయడం, అనంతరం పంటలో కలుపు తీయడం, ఎరువుల వినియోగం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో జె.సౌజన్య, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



రైతు శిక్షణలో పాల్గొన్న ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర పరిశీలకుడు హేమసుందర్

వీరఘట్టం: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను పండించడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర రీజనల్ టెరిటోరియల్ ఆఫీసర్ హేమసుందర్ అన్నారు. చలివేంద్రి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. జీవామృతం, ఘనామృతం తయారీ విధానం, వీటిని పంటల్లో ఏ విధంగా వినియోగించాలి తదితర అంశాలను వివరించారు. ప్రస్తుతం ఈ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా చేస్తున్న నవధాన్యాల సాగును పరిశీలించారు. పంటలు బాగా ఉండడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజు, స్టేట్ టీం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పెన్షనర్ల చెంతకే ఈకేవైసీ సేవలు



కదల్లేని స్థితిలో ఉన్న ప్రభుత్వ పెన్షనర్ వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయిస్తున్న సబ్ ట్రెజరీ అధికారి శంకరరావు

కురుపాం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచనల మేరకు ప్రభుత్వ పెన్షనర్ల ఇంటి వద్దకే వెళ్లి ఈకేవైసీ సేవలు అందిస్తున్నట్లు కురుపాం సబ్ ట్రెజరీ అధికారి కె.శంకరరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు జూలై 20లోగా ఈకేవైసీ పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు కదల్లేని పెన్షనర్లను గుర్తించి ఈకేవైసీ చేయిస్తున్నామని చెప్పారు. ఈ మేరకు శివ్వన్నపేటకు చెందిన కె.మహాలక్ష్మి అనే వృద్ధురాలి ఇంటికి వెళ్లి ఈకేవైసీ చేయించినట్లు తెలిపారు. ఆయన వెంట సిబ్బంది నాగేంద్రసాయి, జగదీష్ ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి



దత్తివలసలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న టెక్నికల్ అధికారి హేమసుందర్

గరుగుబిల్లి:

ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి పెంచుకోవాలని రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందర్ సూచించారు. మండలంలోని నాగూరు క్లస్టర్‌లో దత్తివలస గ్రామంలోని నవధాన్యాలు సాగు చేసిన పంట పొలాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేయడం వల్ల కలుపు నివారణ తగ్గడంతో పాటు ఎరువుల వ్యయం కూడా తగ్గుతుందన్నారు. భూమిలో సేంద్రియ కర్బన శాతం పెరగడం వల్ల తెగుళ్ల తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో డీపీఎం షణ్ముఖరాజు, ఇన్‌చార్జ్ పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.